# ఆయనగారు...

-కైపు ఆదిశేషారెడ్డి

మనసు అలారానికి మెలకువ వచ్చింది. లేచి గడియారం వంక చూసింది. అయిదు గంటలు.

"అమ్మో... అయిదు గంటలే" అనుకొంటూ లేచింది. ఆయన గారికి నిద్రాభంగం కాకుండా మెల్లగా బెడ్‌పై నుంచి దిగి, తలుపు తీసుకుని బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

ఆ రోజు కార్తీక సోమవారం. పొద్దున్నే లేచి స్నానం చేసి, పూజ ముగించుకుని... స్కూల్‌కి వెళ్ళాలి తను. స్నానం చేసి, పెరట్లోకి వెళ్ళి పూలు కోసుకొచ్చింది. పూజగదిలోకి వెళ్ళి. తనకు తెలిసిన శ్లోకాలు చదువుతూ పూజ ప్రారంభించింది.

"ఓయ్...! యెక్కడే...!" బెడ్ రూంలోంచి ఆయన గారి పిలుపు. అది పిలుపే అయినా అరుపులా వుంది.

పూజకి బ్రేక్ పడింది. మంత్రోచ్చారణ ఆగింది.

"యెక్కడ చచ్చావ్... పొద్దున్నే..."

"వస్తున్నానండీ..." పరుగెత్తుకొస్తూ అంది తను.

"కాఫీ...!" అన్నాడు కళ్ళు తెరచి చూస్తూ.

"పూజ వల్ల కొంచెం లేటయింది. రెండు నిముషాల్లో కలుపుకొస్తాను.." గబగబా వెనక్కి తిరిగి కిచెన్‌లో దూరింది.

"నిద్ర లేవగానే మొగుడికి కాఫీ ఇవ్వాలనే జ్ఞానం లేదు గానీ..., టైం ప్రకారం పూజలకి లోటు లేదు..." ఆయన గారి మాటలు కిచెన్‌లోకి వినబడుతున్నాయి. ఆదరా బాదరా కాఫీ కలుపుకొని వచ్చింది.

"యేంటివాళ స్పెషల్..." అంటూ కాఫీ కప్పు అందుకొని పక్కన బెట్టి, మరో చేత్తో తన చేయి పట్టుకుని, దగ్గరకు లాక్కొని... బుగ్గమీద ముద్దు పెట్ట బోయాడు. తను గబాలున వెనక్కి తిరిగి, 'యేవండీ.. యివాళ కార్తీక సోమవారం. యిప్పుడే స్నానం చేసి పూజకి కూర్చొన్నాను..." అంది.

"కార్తీక సోమవారం, శ్రావణ శుక్రవారం... తలస్నానాలు, పూజలు. మొగుడికి ముద్దివ్వద్దని యే దేవుడు చెప్పాడే నీకు. పొద్దున్నే లేచి మొగుడి కాళ్లకి మొక్కి ముద్దు చెల్లిస్తే పుణ్యంగానీ..., ఉపవాసాలు, పూజలు చేస్తే రాదే...! నా కర్మకొద్దీ దొరికావ్ పాత చింతకాయ పచ్చడివి..." అంటూ తన చేయి వదిలి, కాఫీ కప్పు అందుకొన్నాడు.

"రామ.. రామ.. అవేం మాటలండీ..." అంటూ పూజగది వైపు కదిలింది.

"ఓయ్... యేంటి.. మళ్ళీ పూజగదిలోకేనా..?"

'అవునండీ... యేం కావాలి మీకు..?' తను ఆగి అడిగింది.

"పేపర్ తెచ్చివ్వు..." అన్నాడు. వరండాలోంచి పేపర్ తెచ్చియిచ్చింది. తనని పురుగును చూసినట్లు చూస్తూ," పొద్దెక్కిందాకా అక్కడే కూర్చోకు. త్వరగా క్యారియర్ రెడీ చెయ్..." అంటూ పేపర్‌లోకి దూరాడు.

'బ్రతుకు జీవుడా' అనుకొంటూ గబగబా పూజ గదిలోకి దూరి, ఆపేసిన పూజను తిరిగి కొనసాగించింది.

పూజ చేస్తూందే గాని... తన మనసు ప్రశాంతత కోల్పోయింది. ఎంతో యేకాగ్రతతో పూజ చేయాలనుకున్నా.. కుదిరితేగా...! భర్త అరుపులు, హేళన తన చెవుల్లో ధ్వనిస్తున్నాయి... కళ్లలో కదులుతున్నాయి.

తను యెంతో యిష్టపడి, యీ రోజు పూజచేసి, ఉపవాసం ఉండాలనుకుంది. ఎంతో ప్రశాంతంగా లేచి కార్యక్రమం మొదలు పెట్టింది. అయినా ఆయన గారి దినచర్యలు తనని బాగా హర్ట్ చేశాయి.

ఆయన గారెప్పుడూ యింతే... తనని యేదీ ప్రశాంతంగా చేసుకోనివ్వడు. తను ప్రశాంతంగా వుటే.. చూడలేడేమో!

ఎలాగో పూజ అయిందనిపించి, లేచి కిచెన్‌లో దూరింది.

ఆయనకు తొమ్మిదికల్లా క్యారియర్, టిఫిన్ అందించాలి. తనకి యీ రోజు లంచ్ లేదు. ఉపవాసం. తనూ రెడీ అయి తొమ్మిదిన్నరకి కదిల్తే... పదిలోపల స్కూలుకి చేరుతుంది.

తను వంట కార్యక్రమంలో పడింది.

ఆయనగారు లేచి, బాత్రూమ్‌లో దూరి, కార్యక్రమాలన్నీ ముగించుకుని... డ్రెస్ అయి నేరుగా డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చాడు. "యేంటీ... యింకా వంట కాలేదా..?" అంటూ గంభీరంగా వంటగదిలోకి చూశాడు. ఆకలి మీదున్న తోడేలు, కుందేలు వైపు చూస్తున్నట్లున్నాయి ఆ చూపులు.

టిఫిన్ తెచ్చి టేబుల్‌పై పెట్టింది. ఆయన తినేలోగా

## శిశిర వసంతం

న్ని రోజులు చేయి పట్టుకు తీరం దాటించినా
ఇంకా అప్పుడప్పుడు
నునువెచ్చగా చెక్కిళ్ళపై సంతకమౌతూనే ఉంటాయ్
పలకరించి పరీరంభిస్తూనే ఉంటాయ్-
ఎంత యాతన,,,
ఒక చుక్కగా రూపాంతరం చెందిన
ఎంత రిలీఫ్-
బహిర్లోకాల్లో భ్రమించలేక
అంతర్ముఖమైనప్పుడు అంటిపెట్టుకునుండేది
ఆ చుక్క రాలినప్పుడు
గుండె గోలెంని కష్మెతో గీకేస్కున్న గొప్ప ఫీలింగ్-
ఎన్ని ఎదురు చూపులు...
ఎంత దిగాలు...
ఎంత సంతోషం...
ఆ రాక...
ఆ రాక కోసమై ప్రతీక్షణ-
బతుకు భూగోళం తిరుగుతున్నంతసేపు
శుభ్రించే పాకీవాడు ఈ చుక్క-
అది- కత్తులు గుచ్చినచోట రాలిపడ్డ రక్తం చుక్క కాదు
గాయాన్ని మాయం చేసే మారుత వీచిక-
చుక్క కన్ను దాటి మన్ను మీద పడ్డప్పుడు
ఎంతెంత రిలీఫ్-
కన్నీరు ఒజ్జ
కన్నీరు ఒక ఓదార్పు
కన్నీరు ఒకానొక స్నేహితుడు-
కొన్ని కన్నీళ్ళని చిలకరించి చూడు
మోడువారిన శిశిర వృక్షం వసంతమౌతుంది
నెర్రెలు బారిన గుండె చెరువుకు గండి పడ్తుంది
చీకట్లో వెల్తురు రేఖ చేయి బుచ్చుకు నడిపిస్తుంది-
కన్నీళ్ళు
సమస్య కాదు
సమస్యకు సమాధానం-
కన్నీళ్ళు
వృథా కాదు
వ్యధార్థికి చేయూత-
వెంట ఎవరూ రానప్పుడు
నిన్నంటిపెట్టుకు కాపాడుతాయి
లోకం జాలి లేనిదైనప్పుడు
అమ్మలా లాలి పాడ్తాయి
కన్నీళ్ళు కష్టమెలా అవుతాయి-
కనుపాపల వెనక సముద్రాలు
కలకలమై కదిలినప్పుడు
కట్టలు దాటి చేసే అలల సంతకం కన్నీళ్ళు-
ఐనా ఎన్నాళ్ళు!
కన్నీర్చనీయ్
గుండె భారం తీర్చనీయ్!!

-ఈగ హనుమాన్

క్యారియర్ కూడా సర్ది టేబుల్‌పై పెట్టింది. టిఫిన్ తిని, క్యారియర్ తీసుకొని బయలుదేరాడు.

ఆయనగారు బైక్ తీసి రెడీ అయేలోగా... తనూ వాకిట్లోకి యెదురెళ్ళి... రాని నవ్వును పెదాలమీదకి తెచ్చుకొంటూ సాగనంపింది. గుండెల మీద భారం దిగినట్లు ఫీలవుతూ యింట్లోకి నడిచింది.

తను కూడా మరో అరగంటలో రెడీ అయిపోవాలి. లేటయితే స్కూల్ బస్ వెళ్ళిపోతుంది. తర్వాత యే ఆటోనో... బస్సో... పట్టుకొని పోవాలి. లేటయిందనుకో పెద్దసార్ భయంకరంగా తిట్టడు గానీ... సున్నితంగా క్లాస్ పీకుతాడు.

తను త్వరగా రెడీ అయి, తలుపులన్నీ వేసుకొని... పరుగులాంటి నడకతో సెంటర్‌కి చేరేసరికి, స్కూల్ బస్ రెడీగా వుంది. తను యెక్కి కూర్చోగానే కదిలింది.

'హాయ్... యేంటివాళ ఉపవాసమేనా...?' నవ్వుతూ అడిగింది సైన్స్ టీచర్ సునీత.

'అవును. అయిదు గంటలకి లేస్తే.. యిప్పటికైంది..' అంది తను.

'అయినా నీకు చాదస్తం మరీ యెక్కువే..! ప్రతి దానికీ యిలా ఉపవాసాలు, పూజలు. నీ ఓపిక్కి మెచ్చుకోవాలి. నాకైతే అంత ఓపికలేదు. అప్పుడెప్పుడో... మా బామ్మగారి దెబ్బకు తట్టుకోలేక ఉపవాసముంటే.., ఒంటిగంటకు కళ్ళుతిరిగాయి. దొంగతనంగా కిచెన్‌లో దూరి మెక్కేశాను...” నవ్వుతూ బిగ్గరగా... చెపుతూంది.

బస్‌లో మిగతా స్టాఫ్.. పిల్లలు తమనే గమనిస్తున్నారని సైగచేసి, ఆమె నోటికి తాళం వేయించింది. లేకపోతే... స్కూల్ వచ్చేదాకా ఆపదు. తన మొగుడైతే... దీనికి సరిగ్గా సరిపోయేవాడు... అనుకుంది మనసులో తను.

స్కూల్ క్యాంపస్‌లో బస్సు ఆగింది.

అందరూ దిగారు. తనూ దిగి స్టాఫ్ రూమ్‌లోకి నడిచింది.

గంటలు కొట్టారు. పీరియడ్స్ మొదలయ్యాయి.

తనూ లేచి క్లాస్‌కి వెళ్ళింది.

తరగతి గది...! అది మరోలోకం. తెల్లారినప్పట్నించి, యిప్పటి వరకు అనుభవించిన దానికి భిన్నమైన లోకం...! అన్నీ మరచిపోయి... తనూ ఓ చిన్నారిలా... వారితో కలిసిపోయింది. వారితోపాటు... ఆడుతూ, పాడుతూ పాఠాలు చెప్పసాగింది.

వంటగదిలో దొరకని ఆనందం, పూజగదిలో దొరకని ప్రశాంతత, పడకగదిలో లేని వుల్లాసం.. తనకి

దొరికేది యిక్కడే..! యిది తనకి యిష్టమైన స్వర్గం. తనింకా బ్రతకడానికి వూపిరిపోస్తున్న దివ్య ధామం...!

స్కూల్ బస్ దిగి యింటికి చేరేసరికి అయిదున్నర అయింది. ఆయన గారింకా రాలేదు. తను ఫ్రెషప్ అయి, కిచెన్‌లోకెళ్లి టీ పెట్టి... ఫ్లాస్క్‌లో పోసింది.

ఉదయాన్నుండి కఠిన ఉపవాసం. కాస్త కళ్లు తిరిగి నట్లనిపించిచాయి. వెంటనే వంట చేసి... ఉపవాస దీక్ష ముగించాలనుకొంది.

తను స్నానం చేసి వచ్చేసరికి... ఆయనగారు కూడా వచ్చారు. 'టీ' యిచ్చింది.

తాగి బయటికి వెళ్ళాడు... షికారు కొట్టడానికి. ఎనిమిది గంటల దాకా రాడు. యీ లోగా తన కార్యక్రమం ముగించుకోవటానికి సిద్ధమైంది.

తన ఉపవాస దీక్ష ముగించేసరికి... ఆయన గారు వచ్చారు. భోజనం వడ్డించింది. తిని... కాసేపు టీ.వి. చూసి, బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. తను పాత్రలు శుభ్రం చేసుకొంటూ సింక్ దగ్గర వుండిపోయింది.

"ఓయ్... యింకా పని తెమల్లా. నీ వంటగదీ, పూజగదీ తప్పు... పడకగది అక్కర్లేదే...' గర్జించాడు బెడ్ రూమ్‌లోంచి.

"అయిపోయింది. వస్తున్నానండీ' అంటూ కడిగిన వాటిని ప్రక్కన పెట్టి, మిగిలిన వాటిని అలాగే వదిలేసి, తలుపులన్నీ వేసుకొని... బెడ్ రూమ్‌లోకి వచ్చింది. ట్యూబ్‌లైట్ ఆపి, బెడ్‌లైట్ వేసింది.

బెడ్ దగ్గరకొచ్చింది... జరిగి చోటిచ్చాడు.

తను ఒక వైపుకి తిరిగి పడుకొంది. రెండు నిముషాలైనా కాక ముందే... ఆయనగారి చేయి తన నడుంపై పడింది. "ప్లీజ్..!" అంటూ చేతిని తొలగించబోయింది. అయినా వదలక... బలంగా తనని లాక్కొని, రెండు చేతులతో ఆయన వైపుకి తిప్పుకొన్నాడు. తన చెంపలపై, అధరాలపై కసిగా ఆయన పెదాలు దాడిచేశాయి. జుగుప్స కలిగినా... ఆ రాక్షస పట్టునుండి తను తప్పించుకోలేక పోయింది.

"ఈ రోజు ఉపవాసం చేసినందువల్ల... నీరసంగా వుందండీ... ప్లీజ్...!" తను బ్రతిమాలుతూ అంది.

"యేంటే... ఉపవాసం..! నేనేం నిన్ను ఉపవాసం ఉండమన్నానా...?"

"కార్తీక సోమవారంనాడు ఉపవాసం వుంటే.. మంచిదని..."

"యెవరు చెప్పారు...?" వ్యంగ్యంగా అని, "అన్నం లేకుండా నువ్వు ఉపవాసం చేయగలవేమోగానీ... యిది లేకుండా నేను ఉపవాసం వుండలేను..."

"ఒక్కరోజుకే...!"

"ఓసి పిచ్చిదానా! కడుపాకలికి అన్నం, ఈ ఆకలికి అదీ.. లేకపోతే, మనుషులకు పనేముందే...! యీ మొగుడూ... పెళ్ళాం... సంసారాలెందుకు..?"

తను యిక వాదించ దలచుకోలేదు. వాదించినా... అర్థం చేసుకొనే ఓపిక, యింగిత జ్ఞానం ఆయనకి లేవు.

మౌనంగా తన శరీరాన్ని అప్పగించింది.

తన శరీరంపై ఆయనగారి చేతులు మొరటుగా యెక్కడెక్కడో పాకుతున్నాయి. మృగంలా తన తనువుతో ఆడుకొన్నాడు.

పైశాచికానందంతో అలసిపోయి, ప్రక్కకి ఒరిగి పోయాడు. మరో పదినిముషాల్లో గాఢ నిద్రలోకి జారిపోయాడు.

తనకి నిద్రపట్టలేదు. తన మనసు, శరీరం తీవ్ర ఒత్తిడికి గురైనాయి. ఆయన మాటలు మనసును కలచివేశాయి. పైశాచిక శృంగారంతో తన శరీరం నలిగిపోయింది.

## జీవన సత్యం

యిలమ్మా!
కారు చీకటికన్నా
కడు ఘోరం నీ రూపం
అయితేనేం
మావి చిగుళ్ళు తిని
కోటి రాగాలు
గొంతు నిండా నింపుకున్న
నువ్వు నోరు విప్పితే
లోకమంతా
పరవశించిపోతుంది
బాహ్య సౌందర్యం కన్నా
ఆత్మ సౌందర్యమే మిన్న
అన్న జీవన సత్యం
చాటి చెప్పే నువ్వు
నిలువెత్తు
ఆత్మవిశ్వాసానికి
మచ్చుతునక!

**-డి.శ్రీనివాస దీక్షితులు**

ఆయనగారు తనని యేనాడు మనిషిగా చూడలేదు.

తన మనోభావాలను యేనాడు పట్టించుకోలేదు.

ఆయన దృష్టిలో... తనో ఆడది...! ఆయన భౌతిక, శారీరక అవసరాలకు ఉపయోగపడితే చాలు...!

తనకీ మనసుందనీ, దానికి శృతి వుందనీ..., సున్నితమైన భావాలతో దానిని కదిలించి, తీయని అనుభూతులు నింపాలనీ... ఆయన యేనాడు అనుకోలేదు.

ఎంతో హేపీగా ఎంజాయ్ చేయాలనీ, ఆయన... తనూ చిలకా గోరింకల్లా కబుర్లు చెప్పుకొంటూ... పార్కుల చుట్టూ తిరగాలనీ కలలు కంది. పట్నంలో వుద్యోగం కదా సినిమాలకి, షికార్లకి తిప్పుతాడని ఆశపడింది.

యీ పదేళ్లలో తనని యేనాడు సినిమాకి తీసుకెళ్ళలేదు. పెళ్ళయిన కొత్తల్లో తనే నోరు తెరిచి, "సినిమా కెళ్దామండీ..." అని అడిగితే, "నిన్ను వెంటేసుకొని బజార్లో తిరగటానికి నాకు వీలవదు..." అన్నాడు.

భార్యను ఖైదీలా యింట్లోనే పడివుండాలన్న ఆయనగారి తీరు చూసి, తను పెళ్ళయిన నెలరోజులకే ముక్కున వేలేసుకొంది.

అందుకే... కాస్తంత రిలీఫ్‌గా వుంటుందని, తన ఫ్రెండ్ సునీత కోరిక మీద ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరింది. తను చదివిన డిగ్రీ యిలా ఉపయోగపడింది.

మొదట్లో... తను టీచర్‌గా చేరటానికి ఆయనగారు ఒప్పుకోలేదు. "నువ్ సంపాదించి నాకేం పెట్టక్కర్లేదు. యింట్లోనే వుండు..." అన్నాడు. అయినా తానే మొండికేసి చేరింది.

తనెప్పుడైనా స్కూల్లో అలసిపోయివస్తే, "యెందుకే ఆ ముష్టి వుద్యోగం. వాళ్లిచ్చే జీతం నా సిగిరెట్ ఖర్చంత వుండదు...!" అనేవాడు. తనకి జీతం ముఖ్యం కాదని, మనశ్శాంతి కోసమని ఆయనగారికేం తెలుసు...!

తనేదైనా ఆర్గుమెంట్ చేయబోతే... "మొద్దు చాదస్తంలా వుండేదానివి... స్కూల్లో చేరిన తర్వాత... పక్కవారిని చూసి నొక్కులు నేర్చుకొన్నట్లున్నావ్...! మాటలు తగ్గించు..." అంటూ నిప్పుల వర్షం కురిపించేవాడు.

మానసికంగా తట్టుకొనేందుకు... కొంత కాలంగా తన జీవన విధానంలో మార్పు తెచ్చుకుంటున్నది.

నిర్దిష్టమైన ఒక ప్రణాళికను తయారు చేసుకుంది. ఆయనగారు వద్దన్నా... కాదన్నా... తను దాని ప్రకారమే నడవాలని నిర్ణయించుకుంది. మొదటగా ఆయనకు కావలసిన పనులు చేసిపెట్టటం, రాత్రికి... తనకి యిష్టం వున్నా లేకున్నా... శరీరాన్ని అప్పగించటం.

రెండోది... తను మానసికంగా తృప్తిపడటానికి స్కూలు, ప్రశాంతత కోసం పూజలు యెంచుకొంది.

ఆ దినచర్యకి అలవాటుపడుతూంది...!

ఆయన గారు అటునుండి యిటువైపుకి పొర్లుతూ.., "యేంటీ యింకా నిద్రపోలేదా...? పన్నెండు దాటింది..." అన్నాడు.

తను నిద్రపోక పోవడం చూశాడే గానీ..., తన గుండెల్లోంచి యెగదన్నిన లావా, కళ్ళల్లోంచి కారి... చెంపల మీదుగా జారి... చనుకట్టు ముద్దయిపోయిన సంగతి చూడలేదు.

యేడ్చి... యేడ్చి... యే తెల్లారు జాముకో సొమ్మసిల్లి నిద్రలోకి జారిపోయింది.

"యేయ్ మొద్దూ...! లే... తెల్లారి చాలా సేపయింది...." ఆయనగారి పిలుపులాంటి అరుపుతో వులిక్కిపడి లేచింది. వాచిపోయిన కనురెప్పలు బలవంతంగా తెరచుకొన్నాయి.

టైం చూసింది. ఆరున్నర...!

"పొద్దున్నే నిద్రలేచి పాచిముఖం కడుక్కొని... ఫ్రెష్‌గా మొగుడికి మేలు కొలుపు పాడే పెళ్ళాం కావాలని కోరుకొన్నాగానీ... యిలా నా చేత సుప్రభాతం చెప్పించుకొనే మొద్దు మొఖం కావాలనుకోలేదు..." ఆయనగారు దండకం అందుకున్నాడు.

తను జీవితంలో రాజీపడిన ఓ సగటు ఇల్లాలు. మౌనంగా లేచి బాత్రూంలో దూరింది. దినచర్య ప్రారంభమైంది. ■

## ఆత్మీయ నేస్తం

యిదు వందల 'కరెన్సీ నోటైనా'... దానిపై
అక్షరాలుంటేనే కదా... చెల్లుబాటు!
'అక్షరమనేదే లేకుంటే...
'మనీ' (మనిషి) విలువ నగుబాటు'!
'అందరికీ అక్షరం...
ఆపదలో ఆత్మీయ నేస్తం'!

—కుమ్మరి భిక్షపతి